సాక్షి కామారెడ్డి

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



బాపూజీది కీలక పాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలక పాత్ర అని వక్తలు పేర్కొన్నారు.

- 9లో ▸



పట్టాలివ్వాలి

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాలకు చెందిన రైతులు రాస్తారోకో చేశారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8 /22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు అనంత చతుర్దశి



భిక్కనూరు: జిల్లాలోనే ఏకైక అనంత పద్మనాభస్వామి ఆలయం భిక్కనూరు మండల కేంద్రంలోనే ఉంది. గురువారం అనంత చతుర్దశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా నుంచే కాకుండా ఇరుగు పొరుగు జిల్లాల నుంచి కూడా అనంత చతుర్ధి సందర్భంగా ఆలయంలో దీపపు వొత్తులు వెలిగించేందుకు కావలసిన సౌకర్యాలు కల్పించారు.

లడ్డూ ధర రూ.2.27 లక్షలు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలోని తెలంగాణ కాణిపాకం శ్రీసంకష్ట హర గణపతి దేవాలయంలో స్వామివారి కల్యాణం లడ్డూకు మంగళవారం వేలం నిర్వహించారు. భిక్కనూరుకు చెందిన వ్యాపారి గౌరిశెట్టి సంతోష్‌కుమార్ రూ. 2.27 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

'ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి'




లింగంపేట: చిన్న, సన్నకారు రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలైన పండ్ల తోటలు, చేపల పెంపకంపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు. బుధవారం ఆయన లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, తాడ్వాయి, రాజంపేట మండలాలకు చెందిన ఏపీవోలు, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో 15 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటలు పెంచేలా చూడాలన్నారు. ఆలాగే పొలం గట్లపైన కొబ్బరి, మామిడి చెట్లు పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చేపల చెరువులు ఏర్పాటు చేసుకోవడానికి వీలుందన్నారు. గ్రామాల్లో కొత్త పనులు గుర్తించాలని ఆదేశించారు.

'ఇంటి పన్నులు వసూలు చేయాలి'



కామారెడ్డి క్రైం: ఇంటి పన్నులను ఈనెలాఖరులోగా వంద శాతం వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం తాగునీరు, విద్యుత్ బిల్లులను చెల్లించేలా చూడాలన్నారు. గాంధారి, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల్లో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయన్నారు. అవసరం లేని చోట విద్యుత్ మీటర్లను తొలగించాలని, వాటి వివరాలను ఏఈలకు అందించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పోలింగ్ బూత్‌లలో ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో శ్రీనివాసరావు, డీఎల్‌పీవోలు సురేందర్, శ్రీనివాస్, ఎంపీవోలు పాల్గొన్నారు.

యోగా క్రీడాకారులకు అభినందనలు



కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలను కలిశారు. వారు క్రీడాకారులను అభినందించారని జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రఘుకుమార్, యోగాచార్యులు అంజయ్యగుప్తా, లక్ష్మీరాజం, గోమతి తదితరులు పాల్గొన్నారు.

బైలెల్లె బైలెల్లె గణపతి..

- జిల్లాకేంద్రంలో ఘనంగా ప్రారంభమైన నిమజ్జనోత్సవం
- శోభాయాత్రను ప్రారంభించిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ శోభాయాత్ర బుధవారం రాత్రి ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ధర్మశాల వద్ద ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. నిమజ్జనోత్సవాన్ని తిలకించడానికి పట్టణవాసులతోపాటు సమీప గ్రామాలనుంచీ భక్తజనం తరలివచ్చారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు నీళ్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఘ్నాలు తొలగాలి..

వినాయకుడి ఆశీస్సులతో విఘ్నాలు తొలగిపోవాలని, ప్రజలకు శుభాలు చేకూరాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆకాంక్షించారు. శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. హైదరాబాద్ తరువాత కామారెడ్డిలోనే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. ఏటా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేదికను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఉత్సవ సమితిని అభినందించారు. ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరుపుకోవడానికి సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని ధర్మశాల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు.



శోభాయాత్రను ప్రారంభిస్తున్న గంప గోవర్ధన్, చిత్రంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, కలెక్టర్, ఎస్పీ

శోభాయాత్రకు పటిష్ట భద్రత

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కామారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో బందోబస్తుకు హాజరైన పోలీస్ సిబ్బంది, అధికారులకు శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 20 మంది ఎస్సైలతో సహా మొత్తం 300 మంది పోలీసులు శోభాయాత్ర బందోబస్తులో ఉన్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉత్సవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న గంప గోవర్ధన్



నిమజ్జనోత్సవంలో భక్తుల సందడి



నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



జిల్లాకేంద్రంలో శోభాయాత్రను తిలకిస్తున్న భక్తులు

'పారదర్శకంగా ఓటరు జాబితా'

కామారెడ్డి క్రైం: పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడం కోసమే గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదు కావాలన్నారు. అలాగే సరైన విచారణ జరపకుండా ఏ ఒక్క ఓటరు పేరును కూడా జాబితా నుంచి తొలగించరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. అందులో భాగంగా సెకండ్ సమ్మరి రివిజన్ చేపట్టామని తెలిపారు. జూలై 16 నుంచి ఈనెల 19 వ తేదీ వరకు నూతన ఓటరు నమోదు, సవరణలకు అవకాశం ఇవ్వగా 49,424 దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులతో డమ్మీ ఓట్లు వేయించి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మదన్‌లాల్ జాదవ్, ఖాసిం అలీ, బాలరాజు, మహమ్మద్ జాఫర్ ఖాన్, అనిల్ కుమార్, సీపీవో రాజారాం, జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓటింగ్ విధానంపై నాయకులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్త మండలంగా మహమ్మద్‌నగర్

- ఫైనల్ నోటిఫికేషన్ విడుదల



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిజాంసాగర్ మండలం పరిధిలో ఉన్న 18 గ్రామాలను విడదీసి, మహమ్మద్‌నగర్ కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో గున్కుల్, తెల్గాపూర్, శనివార్‌పేట్, సింగితం, వెంగళంపల్లి, ముగ్దుంపూర్, గాలీపూర్, కోమలంచ, తున్కిపల్లి, తుర్కపల్లి, శేర్‌ఖాన్‌పల్లి, నర్వ, బూర్గుల్, హసన్‌పల్లి, నర్సాపూర్, రాఘవపల్లి, కోనంపల్లి, రంగాపురం గ్రామాలున్నాయి. మహమ్మద్‌నగర్ మండలం ఏర్పాటుకు ఫైనల్ నోటిఫికేషన్ రావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులివ్వొద్దు



లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

బాన్సువాడ: గృహలక్ష్మి పథకం కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇళ్ల కోసం ఎవరికైనా డబ్బులు ఇస్తే తీసుకున్న వారితోపాటు ఇచ్చిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బుధవారం బీర్కూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటగా గృహ లక్ష్మి పథకం మంజూరు పత్రాలను బీర్కూర్‌లోనే ఇస్తున్నామన్నారు. ఈ పథకంలో బేస్‌మెంట్ వరకు ఇల్లు కట్టుకుంటే రూ. లక్ష, స్లాబ్ నిర్మిస్తే మరో లక్ష రూపాయలు, గోడల నిర్మాణం పూర్తయితే మిగిలిన లక్ష రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. గృహలక్ష్మి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. పథకం కింద ఇల్లు మంజూరైన వారు పునాదులు తీసుకుని నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఆర్డీవో భుజంగరావు, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో భానుప్రకాష్, నాయకులు సాయిలు, శశికాంత్, గంగారాం, రాజు, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఏటీఎంలో భారీ చోరీ

- రూ.12 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు
- గ్యాస్ కట్టర్‌తో మిషన్ ధ్వంసం
- డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు



దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ కూడలి సమీపంలో జాతీయ రహదారి 44 పక్కన ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గల ఏటీఎంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి సుమారు రూ. 12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఏటీఎంలోకి చొరబడి ముందుగా సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను ధ్వంసం చేశారు. అందులోంచి నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎంలో దొంగలు చొరబడిన వెంటనే తెల్లవారుజామున 3.18 గంటలకు బ్యాంకు మేనేజర్ బాలరాజు సెల్ ఫోన్‌లో అలారం మోగింది.

వెంటనే ఆయన మెండోరా పోలీస్ స్టేషన్‌కు, ఎస్సైకి ఫోను ద్వారా సమాచారం అందించాడు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకునే లోపే దొంగలు పరారైనట్లు తెలిపారు. పోలీసులు క్లూజ్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ శునకం ఏటీఎం నుంచి నిర్మల్ వైపు గల రోడ్డు వెంబడి వెళ్లి దూదిగాం గ్రామ శివారులో బస్టాండ్ వద్ద నిలిచి పోయింది. అక్కడి నుంచి దొంగలు నిర్మల్ వైపు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

దొంగలు కారులో ...

ఏటీఎం వద్దకు దొంగలు వాగనర్ కారు (ఏపీ25 ఎల్9023)లో గ్యాస్ కట్టర్‌లతో వచ్చినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి డిచ్‌పల్లిలో వాగనర్ కారు ఎత్తుకెళ్లినట్లు కేసు నమోదైందన్నారు. ఎవరికైనా కారు ఆచూకీ లభిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పోలీసులు సకాలంలో వెళ్తే..

చోరీకి గురైన ఏటీఎం నుంచి పోలీసు స్టేషన్ 8 కిలోమీటర్లు ఉంటుంది. ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేయడానికి దొంగలకు కనీసం అరగంటైనా పట్టి ఉంటుందని, బ్యాంకు మేనేజర్ సమాచారం ఇచ్చిన వెంటనే సకాలంలో పోలీసులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు గానీ వెళ్లి ఉంటే చోరీ జరిగేది కాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది బుస్సాపూర్‌లో..

గతేడాది జూలైలో మెండోరా మండలం బుస్సాపూర్‌లో జాతీయ రహదారి 44 పక్కనే గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్యాస్ కట్టర్‌లతోనే లాకర్లను ధ్వంసం చేసి నగదు, 8 కిలోల బంగారం ఎత్తుకెళ్లారు. ఆ కేసు ఇప్పటికీ పూర్తి స్థాయిలో కొలిక్కిరాలేదు. ప్రస్తుతం అదే మాదిరి జాతీయ రహదారి పక్కనే గల ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్‌తోనే ధ్వంసం చేసి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గతంలో ఏటీఎంలో చోరీకి పాల్పడిన యూపీకి చెందిన గ్యాంగులో కొందరు పోలీసులకు చిక్కారు.

ఆరు బృందాలు ఏర్పాటు..

ఏటీఎంలో చోరీకి పాల్పడిన దొంగల కోసం ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అడిషనల్ డీసీపీ జయరాం తెలిపారు. ధ్వంసమైన ఏటీఎంను ఆర్మూర్ ఏసీపీ జగదీశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏటీఎంలో చోరీ జరిగిన మాదిరిగానే గతంలో ఎక్కడైనా జరిగిందా కోణంలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ వెంకటప్ప, ఎస్సై శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'అభివృద్ధిలో దేశానికే ఆదర్శం'



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.10.18 కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మన ఊరు మనబడి కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాల భవనాలు, సీసీ రోడ్లతో పాటు, నూతన సింగిల్‌విండో కార్యాలయం, హెల్త్ సబ్‌సెంటర్, వివిధ కుల సంఘాల భవనాల పనులను ప్రారంభించారు. గుండ్ల చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో 1.80 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కామారెడ్డినుంచి పోటీ చేసే సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు, నాయకులు శంకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పన్యాల నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి



రాజంపేట: రైతులు పంటలకు వచ్చే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అలాగే సాగులో చేపట్టాల్సిన నెలకువల గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. ఈ సీజన్లో వరి పంటలకు ఆశించే కాండం తొల్చు పురుగు అలాగే అగ్గి తెగులు లక్షణాలు అక్కడక్కడ మండలంలో కనిపించాయని.. నివారణకు కాండం తొల్చు పురుగు గమనించిన వెంటనే కార్టప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును 0.4 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పొలం అంతా సమానంగా పిచికారి చేయాలని సూచించారు.

క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి జీపీలో క్షేత్రసహాయకుడిగా పని చేస్తున్న శివరాంపై బుధవారం డీఆర్‌డీవో సాయన్న, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు శెట్పల్లి గ్రామస్తులు తెలిపారు. చెరువు మట్టి పంట చేలల్లో వేయిస్తానని, జాబ్‌కార్డులు ఇప్పించి, బాత్రూమ్‌లు కట్టిస్తామని, పలువురి వద్ద రూ.50 వేల వరకు శివరాం డబ్బులు వసూలు చేసి ఎవ్వరికి పనులు చేయించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా.. క్షేత్రసహాయకుడు అక్రమ వసూళ్లు చేసినట్లు పాలక వర్గం తీర్మానం చేసినట్లు తెలిపారు. తీర్మాన కాపీని బుధవారం డీఆర్‌డీవో, ఎంపీడీవోకు అందజేసినట్లు చెప్పారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



కామారెడ్డి అర్బన్: సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై పర్యాటకం ఆధారపడి ఉంటుందని, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి 1980 నుంచి ప్రపంచ పర్యాటక దినోత్సవం వివిధ దేశాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడలు, యువజన అధికారి వై.దామోదర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు 'పర్యాటకం–గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా.. 179 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాస రచన పోటీల్లో ఎస్. స్నేహ(ప్రథమ), అంజలి(ద్వితీయ) బహుమతులు పొందారు. ఉపన్యాస పోటీల్లో పూర్వజ(ప్రథమ), గౌసియ(ద్వితీయ), చిత్రలేఖనంలో అభిరామ్(ప్రథమ), బుష్ర షిరిన్(ద్వితీయ) బహుమతులు పొందారు. ప్రోత్సాహక బహుమతిని జబ్రాన్‌అలీకి అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

డొంకేశ్వర్(ఆర్మూర్): నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు పడింది. పనిదినాలు తక్కువ కల్పించినందు సందీప్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కూలీలకు పనిదినాలు తక్కువ కాకుండా ఎక్కువ రోజులు పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు డీఆర్‌డీవో సూచించారు.

సెల్ఫీ విత్ గణేశ్



శ్రీమయి, పృథ్వి, రుగ్వేద, ఫత్లాపూర్, బిచ్కుంద



సంతోష్, కామారెడ్డి



శ్రీధర్‌రావు, జీఆర్ కాలనీ, కామారెడ్డి



శ్రీనివాస్, బీబీపేట్



చైతన్య, లింగంపేట్



బాల గణేశ్ మండలి, దోమకొండ



నోబుల్ యూత్ క్లబ్, కామారెడ్డి



ఓంకార్, నాగిరెడ్డిపేట్



వైష్ణవి, మద్నూర్



రాజేందర్, అఖిల, రుత్విక్, సాత్విక్, రామారెడ్డి



కోయల్, బిచ్కుంద



నవ్య కృష్ణమూర్తి, లింగంపేట్



అభి, బాల్‌రాజ్, ముత్యంపేట్



శ్రీధర్, కాచాపూర్, భిక్కనూర్



యువ భారత్ మండలి, నస్రుల్లాబాద్



పెద్ద హనుమాన్ మందిర్, బాన్సువాడ

జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగాలు



ఉద్యోగం పొందిన యువతికి నియామకపత్రం అందజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడలో నిర్వహించిన పీబీఆర్ జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పీబీఆర్ మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నియోజకవర్గం నుంచి 4 వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు ఇప్పించాలనే మంచి సంకల్పంతో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు 70 రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రావడం హర్షణీయమని అన్నారు. నాలుగు వేల మంది ఉద్యోగ ఆశావహులు వచ్చారని, ఉద్యోగం కోసం ఖర్చు పెట్టుకుని హైదరాబాద్ వెళ్లకుంగా రూపాయి ఖర్చు లేకుండా బాన్సువాడలో జాబ్‌మేళా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

నిరుద్యోగుల కోసమే జాబ్ మేళా: భాస్కర్‌రెడ్డి

నిరుద్యోగుల కోసమే జాబ్ మేళాను ఏర్పాటు చేశామని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. ఉద్యోగం సాధించిన అభ్యర్థులు వెంటనే ఆఫీసుల్లో జాయిన్ కావాలని కోరారు.1,411 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపీపీ నీరజ, జెట్పీటీసీ పద్మ, కంపెనీల ప్రతినిధులు ఉన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): అటవీ హక్కుల చట్టం -2006ను అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన లింగంపేట మండలం ఒంటర్‌పల్లి, ఎల్లారం, మోతె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. అక్టోబర్ 5న చలో కామారెడ్డి కలెక్టరేట్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోడు భూములపై ఫారెస్టు అధికారులు దాడులు చేసి రైతులు, గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలు పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి కొంత మందికే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 70 సంవత్సరాలుగా పంటలు సాగు



మాట్లాడుతున్న ప్రజాపంథా నేత రామకృష్ణ

చేసుకుంటున్న వారికి నేటికి పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నందున సాగుదారులు అందరూ అక్టోబర్ 5న కామారెడ్డికి తరలివచ్చి మన సత్తా చాటాలన్నారు. నాయకులు బాలరాజు, పరమేశ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



లింగంపేటలో వంటా వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడి ఉద్యోగులు



నాగిరెడ్డిపేటలోని సమ్మె శిబిరంలో పిండివంటలు చేస్తున్న అంగన్‌వాడీలు

సాక్షి నెట్‌వర్క్:ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్లు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. బుధవారం కూడా అంగన్‌వాడీ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. సమ్మె శిబిరాల్లో వంటా వార్పు చేసి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ఇప్పటికైనా నెరవేర్చాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. డిమాండ్లు సాధించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

తెయూ సమాచారం

అక్టోబర్ 4 వరకు బీపెడ్ పరీక్ష ఫీజు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీపెడ్ రెగ్యులర్ 2వ, 4వ సెమిస్టర్ థియరీ పరీక్షలకు సంబంధించి అక్టోబర్ 4వరకు ఫీజు చెల్లించవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ బుధవారం తెలిపారు. రూ. వంద అపరాధ రుసుముతో అక్టోబర్ 5 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. అనుబంధ కళాశాలల ప్రధానాచార్యులు సంబంధిత దరఖాస్తులను అక్టోబర్ 7వరకు తెయూ పరీక్షల విభాగంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సందర్శించాలని సూచించారు.

అక్టోబర్ 7వరకు బీఈడీ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ రెగ్యులర్ 2వ సెమిస్టర్ థియరీ పరీక్షలకు సంబంధించి అక్టోబర్ 7 వరకు ఫీజు చెల్లించవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. రూ. వంద అపరాధ రుసుముతో అక్టోబర్ 10 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. అనుబంధ బీఈడీ కళాశాలల ప్రధానాచార్యులు దరఖాస్తు ఫారాలను అక్టోబర్ 11న తెయూ పరీక్షల విభాగంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity.ac.in ను సందర్శించాలని సూచించారు.

5 నుంచి ప్రిపీహెచ్‌డీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో వివిధ సబ్జెక్టుల్లో ప్రీపీహెచ్‌డీ పరీక్షలు అక్టోబర్ 5 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. అక్టోబర్ 5న అన్ని సబ్జెక్టులలో రీసెర్చ్ మెథడాలజీ, 6న సంబంధిత ఎంచుకున్న సబ్జెక్టు, 7న రీసెర్చ్ పబ్లికేషన్ ఎథిక్స్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity.ac.inను సందర్శించాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం క్యాంపస్ నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

డిచ్‌పల్లిలో కారు చోరీ

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని దొంది సత్యనారాయణ తన కారు (ఏపీ 25 ఎల్ 9023) చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 25న మధ్యాహ్నం తన ఇంటి ముందు నిలిపిఉంచాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి కారు కనిపించలేదు. బాల్కొండ మండలం పోచంపాడ్‌లో ఏటీఎం చోరీ ఘటనలో ఈ కారు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



దోమకొండలో సమ్మె చేస్తున్న ఆశావర్కర్లు



బీబీపేట పీహెచ్‌సీ వద్ద..

సాక్షి నెట్‌వర్క్:తమకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్ల ఆందోళనలు బుధవారం కూడా కొనసాగాయి. అర్హత కలిగిన ఆశాలకు ఏఎన్ఎం, జీఎన్ఎం ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్లకు న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే పలు చోట్ల ధర్నాలు నిర్వహించారు. భిక్కనూరులో ఆశావర్కర్ల సమ్మెకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ మద్దతు తెలిపి మాట్లాడారు.



తాడ్వాయిలో..



జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట..

డబ్బుల కోసమే హత్యాయత్నం

- ఇద్దరి నిందితుల అరెస్ట్
- పీడీఎస్ దందాపై ఉక్కుపాదం మోపుతాం
- సీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా సిరికొండలో ఈ నెల 21న జరిగిన కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. సిరికొండకు చెందిన మహ్మద్ అన్సార్, జిల్లా కేంద్రానికి చెందిన రెహమాన్‌లు 2018 నుంచి 2022 వరకు పీడీఎస్ బియ్యం దందా చేసేవారని తెలిపారు. దందాలో రెహమాన్ రూ.18 లక్షలు అన్సార్‌కు ఇవ్వాల్సి ఉంది. అన్సార్, స్నేహితుడు ఇస్రార్, జునైద్‌ల ద్వారా హైదరాబాద్‌కు చెందిన రౌడీషీటర్ అసద్‌తో మాట్లాడి రెహమాన్ నుంచి డబ్బులు ఇప్పించాలని సిరికొండకు రప్పించారు. దీంతో అసద్ తన స్నేహితులు ఆసిఫ్, అయాజ్‌ఖాన్, అల్లుడు అద్నాన్ తమ్ముడు అబ్దుల్లాతో కలిసి ఇన్నోవా కారులో ఈ నెల 21న వచ్చారు. అన్సార్ స్నేహితులు ఇస్రార్, మహేందర్, జునైద్ అక్బర్, దీపక్, జుబైర్, అసద్ టీంతో కలిసి మండల శివారులోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో దావత్ చేసుకున్నారు. అర్ధరాత్రి నిందితుడు అసద్ రెహమాన్‌తో డబ్బుల విషయం మాట్లాడుదామని అన్సార్‌కు తెలుపగా అందుకు అన్సార్ ఒప్పుకోలేదు. పొద్దున సెటిల్‌మెంట్ చేసుకుందామని చెప్పడంతో తాను దావత్‌కు రాలేదని కోపంతో మద్యం మత్తులో అసద్ కత్తితో అన్సార్‌పై ఆసిఫ్‌తో కలిసి దాడి చేశాడు. దీంతో ఛాతి, భుజంపై గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన మహేందర్, జునైద్‌కు సైతం గాయాలయ్యాయి. దీంతో అక్కడి నుంచి నిందితులు కారులో పారిపోయారు. అన్సార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ జయరామ్, ఏసీపీ కిరణ్‌కుమార్, ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సాక్షులను బెదిరించిన నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: మూడు నెలల క్రితం జరిగిన ఆరిఫ్ డాన్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన షేక్ సమదుద్దీన్‌ను అరెస్ట్ చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరిఫ్‌డాన్ హత్య కేసులో షేక్ సమదుద్దీన్‌ను అరెస్ట్ చేయగా కొన్ని రోజుల క్రితం జైలు నుంచి విడుదల కాగా ఈ కేసులోని సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు మహమ్మద్ ఐజక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. షేక్ సమదుద్దీన్‌పై రెండో పీఎస్‌లో 12, మూడో పీఎస్‌లో 8, నాలుగో పీఎస్‌లో 14, ఆరో పీఎస్‌లో 5 కేసులు, బోధన్‌లో ఒక మర్డర్ కేసు నమోదైనట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్‌లో సర్పంచ్ సామ ముత్యంరెడ్డి ఇంట్లో ఈనెల 23న జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. పీఎస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. ఇంట్లో బంగారం చోరీ జరిగిందన్న సర్పంచ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా గ్రామంలో ఫాగింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న బోధన్ మండలం ఊట్‌పల్లికి చెందిన వినోద్‌పై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అనంతరం సిబ్బందిని ఎస్సై అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్సై రాము

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి



మృతి చెందిన రవి (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): బెల్లాల్ గ్రామానికి చెందిన రవి(45) స్థానిక చెరువులోపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. రవి రోజు కూలి పని చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చెరువులో తామెర పూలు తీసుకొస్తానని మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రవి మృతదేహంగా గుర్తించారు. రవి మృతిపై భార్య, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య బుజ్జిబాయి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..

రామారెడ్డి (ఎల్లారెడ్డి): గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండ నరేశ్ (28)కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. నరేశ్‌కు గతంలోనూ గుండెపోటు వచ్చిందని గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా డీజే శబ్దానికి మరోసారి గుండెపోటు వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. నరేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



షాదుల్లా (ఫైల్)

డిచ్‌పల్లి: బతుకుదెరువు నిమిత్తం ఓమన్ దేశానికి వెళ్లిన బర్ధీపూర్ గ్రామానికి చెందిన షేక్ షాదుల్లా (45) అనారోగ్య సమస్యతో ఈ నెల 17న మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహం స్వగ్రామానికి బుధవారం చేరుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గల్ఫ్‌లోని ఒమన్ దేశానికి వెళ్లిన షాదుల్లా 15న బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురికాగా 17న మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నీరడి సుజన, గ్రామస్తులు కోరారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డి: బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన కోర్ల మహేశ్ (18) తల్లిదండ్రులు బైక్ కొనివ్వడం లేదనే మనస్థాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో దూకిన వివాహితను కాపాడిన యువకుడు

నందిపేట: మండల కేంద్రంలోని తాళ్ల చెరువులో పడి మునిగిపోతున్న ఓ వివాహితను గ్రామానికి చెందిన యువకుడు నాగుల సుధాకర్ కాపాడాడు. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండం అంజలి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటిలో మునుగుతున్న ఆమెను చూసిన చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాహుల్, కానిస్టేబుల్ లింగం ఘటన స్థలానికి చేరుకొని స్థానికుడు సుధాకర్ సహాయంతో బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. మహిళ ఆరోగ్యం నిలకడగా ఉంది.